క్లుప్తంగా

మెరుగైన వైద్యం అందించాలి

కిర్లంపూడి: గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని ఎంపీపీ తోట రవి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆసుపత్రుల అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఆసుపత్రిలోని ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలు, లోటుపాట్ల గురించి ఎంపీపీ తోట రవి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ హెచ్ హరికృష్ణ, వైద్యులు రాంబాబు నాయక్, అరుణ, అభిషేక్, ఆసుపత్రుల సిబ్బంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు

గండేపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు రెండు అర్జీలు అందినట్టు ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని, అభయ హస్తం ఇవ్వాలని అర్జీలు అందాయన్నారు. ఆయా అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు ఆర్థిక చేయూత



ఏలేశ్వరం మెప్మా మార్కెట్‌లో సామగ్రి కొనుగోలు చేస్తున్న కౌన్సిలర్ నారాయణస్వామి

ఏలేశ్వరం: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు పట్టణ నిర్మూలన సంస్థ (మెప్మా) చేయూతనిస్తోందని మున్సిపల్ కౌన్సిలర్ మూదినారాయణస్వామి అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్‌ను ఆనుకుని సోమవారం మెప్మా టీఎంసీ సాయికుమార్ ఆధ్వర్యంలో మెప్మా అర్బన్ మార్కెట్ ఏర్పాటు చేశారు. డ్వాక్రా సంఘాల సభ్యులు తయారు చేసిన దుస్తులు, వెదురుబుట్టలు, స్నాక్స్, పినాయిల్, తదితర వస్తువులు మెప్మా మార్కెట్‌లో అమ్మకాలు చేశారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఆర్థికభరోసా ఇచ్చేందుకు మెప్మా కృషి చేస్తుందన్నారు. ప్రతినెలా మార్కెట్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. డ్వాక్రా మహిళలు మార్కెట్‌ను సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలు తొలగించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కాకినాడలో జరిగిన స్పందనలో జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన గొర్ల వెంకటరత్నం మాట్లాడుతూ ధర్మవరంలో రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించాలని కోరారు.

అమిత్ షా వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి

రౌతులపూడి: పార్లమెంటులో ఇటీవల రాజ్యాంగ నిర్మాత, దాదాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సోమవారం ఆ పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లిబరేషన్ పార్టీ మండల నాయకుడు సామిరెడ్డి నారాయణమూర్తి మాట్లాడుతూ అమిత్ షా అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయుకులు కె.జనార్దన్, ఆవాల అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

భక్తుడికి సెల్‌ఫోన్ అప్పగింత



లోవ దేవస్థానంలో భక్తుడు శివకు ఫోన్ అందజేస్తున్న రాజు

తుని: లోవ దేవస్థానంలో పని చేస్తున్న చిరుద్యోగి తనకు దొరికిన సెల్‌ఫోన్‌ను పోగట్టుకున్న భక్తుడికి అప్పగించి నిజాయితీని చాటుకున్నట్టు ఆలయ ఈఓ విశ్వనాథరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే...సోమవారం విజయనగరం జిల్లా రొట్లపల్లి గ్రామానికి చెందిన చందక శివ తలుపులమ్మ అలయానికి వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని కిందకు వస్తుండగా ఫోన్ కనిపించకపోవడంతో ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. దేవస్థానంలో పని చేస్తోన్న గార్డెనర్ సారిపల్లి రాజుకు ఫోన్ దొరకడంతో శివకు అప్పగించారు. దీని విలువ రూ.20 వేలు ఉంటుందన్నారు. నిజాయితీ చాటిన చిరుద్యోగి రాజును దేవస్థానం అధికారులు, భక్తుడు శివ అభినందించారు.

సబ్ జైలులో తనిఖీలు

ప్రత్తిపాడు: స్థానిక సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు సోమవారం సాయంత్రం తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. జైలులో అందుతున్న వసతులు, సౌకర్యాలపై ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల పెట్టెను తెరచి చూశారు. ఎటువంటి ఫిర్యాదులు లేకపోవడంతో ఎవరికైనా ఇబ్బందులుంటే ఫిర్యాదు పెట్టెలో రాసి వేయాలన్నారు. ఆయా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఇసుకాసురులు

- ఏలేరు కాలువలో అక్రమంగా ఇసుక తవ్వకాలు
- ప్రతిరోజూ ట్రాక్టర్లతో తరలింపు
- సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు



ఏలేరుకాలువ నుంచి ట్రాక్టర్లపై తరలిస్తున్న ఇసుక



తిరుమాలిలో జేసీబీతో లారీలో లోడ్ చేస్తున్న ఇసుక

ఏలేశ్వరం: స్థానిక ఏలేరు కాలువలో ఇసుక అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఏలేరు కాలువలో ఇసుక తవ్వకాలపై నిషేధం ఉన్నా సక్రమంగా అమలు కావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా కొందరు ఇసుక తవ్వకాలు సాగించి సొమ్ము చేసుకుంటున్నారు. కళ్ల ముందే ఇసుక దోపిడీ జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

రెండు మండలాల్లో..

ఏలేరు ప్రాజెక్టు నుంచి ఏలేశ్వరం మండలం తిరుమాలి, యర్రవరం, జగ్గంపేట మండలంలోని మామిడాడ, ఇర్రిపాక గ్రామాలను ఆనుకుని కాలువ ఉంది. ఇటువైపు ఏలేశ్వరం మండలం కాగా అటువైపు జగ్గంపేట మండలం ఉంది. రెండు మండలాల నుంచి ప్రతిరోజూ ఇసుకను ట్రాక్టర్లతో తరలించుకుపోతున్నారు. దీంతో కాలువలో గోతులు ఏర్పడి దిగువ ప్రాంతానికి నీరువెళ్లేందుకు వీలు లేని పరిస్థితి నెలకొంది. ఇసుక తరలింపులో అధికార పార్టీ నేతలతో పాటు రెవెన్యూ అధికారులు ప్రమేయం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. కాలువలో ఇసుక ఉచితంగా తవ్వుకుని పోయి బయట వేలాది రూపాయిలకు అమ్ముతున్నారు. తెల్లవారుజాము 4 గంటల నుంచి ఉదయం 11 గంటలలోపు ఒక్కసారిగా పది నుంచి 20 ట్రాక్టర్లతో యథేచ్ఛగా ఇసుక తరలిస్తున్నారు. జేసీబీలతో ట్రాక్టర్లల్లోకి ఇసుకను లోడ్ చేస్తున్నారు.

కుటీర పరిశ్రమగా ఇసుక వ్యాపారం

కాలువను ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఇసుకను ఇళ్ల మధ్యనే నిల్వ ఉంచుతున్నారు. ఇళ్ల మధ్య గుట్టలుగా వేసి ధర పెంచి అమ్ముతున్నారు. ఒక్కో గ్రామంలో సుమారు 50 వరకు ట్రాక్టర్లు ఉన్నాయంటే ఇసుక వ్యాపారం ఏ స్థాయిలో జరుగుతుందో అర్థం చేసుకోవచ్చు. దీంతో పాటు ట్రాక్టర్లతో ఇసుకను ఇళ్ల మధ్య వేసి లారీలపై సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గ్రామాల్లో చాలావరకు వ్యాపారులు ఇసుకను కుటీర పరిశ్రమగా మార్చుకున్నారనే విమర్శలు వస్తున్నాయి.

అధికారపార్టీ నేతల దన్నుతో..

అధికార పార్టీ నేతల దన్నుతోనే ఇసుక తరలింపు జరుగుతోంది. దీంతో ఇసుక అక్రమ రవాణాపై ఎవరన్నా ప్రశ్నిస్తే తమకు అధికారం, అనుమతి ఉందని ట్రాక్టర్ డ్రైవర్లు బహిరంగంగా చెప్పడం గమనార్హం. ఇసుక తరలింపు విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు. పైపెచ్చు ఉచిత ఇసుక ప్రభుత్వం విధానమని అధికారులు చెబుతున్నారు. ఏలేరు కాలువలో ఇసుక తరలించడంపై నిషేధం ఉందని అడిగితే ఇసుకను తరలిస్తున్నట్టు తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు చెబుతుండడం విశేషం.

> **చర్యలు తీసుకుంటాం**
>
> అక్రమంగా ఏలేరు కాలువలో ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. ఇష్టానుసారం ఇసుక తవ్వకాలు జరిపితే నిబంధనలు అతిక్రమించినట్టే. ఇసుక తరలింపుపై సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటాం.
>
> –ఆర్‌వీ వెంకటేశ్వరరావు, తహసీల్దార్, ఏలేశ్వరం మండలం

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పాటు ఏలేరు కాలువను పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐలు గీతా రామకృష్ణ, చెన్నకేశవరావు

తుని: క్రిస్మస్, సంక్రాంతి పండగలను పురస్కరించుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని తుని పట్టణ, రూరల్ సీఐలు గీతా రామకృష్ణ, చెన్నకేశవరావు హెచ్చరించారు. తుని రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. పండుగ సమయంలో పేకాట, గుండాట, కోడి పందేల నిర్వహణకు అనుమతులు ఇవ్వబోమన్నారు. గ్రామాలు, పట్టణ పరిధిలో నిబంధనలకు వ్యతిరేకంగా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ర్యాలీలు, ఊరేగింపులు, మత పరమైన కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలన్నారు. ఇటీవల దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో సొంతిల్లు కలిగిన వ్యక్తులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. హైకోర్టు సూచనల మేరకు ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించాలన్నారు. హెల్మెట్ లేకుండా రెండోసారి దొరికితే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసులకు ఎవరైనా తప్పుడు ఫిర్యాదులు చేస్తే పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఘనంగా జాతీయ రైతు దినోత్సవం



కిర్లంపూడిలో రైతుల కష్టాలను నాటిక రూపంలో ప్రదర్శిస్తున్న విద్యార్థులు



రైతులను సత్కరించిన విద్యార్థులు, పాఠశాల యాజమాన్యం

కిర్లంపూడి: మండలంలోని జగపతినగరంలో సోమవారం జాతీయ రైతు దినోత్సవం నిర్వహించారు. ఎస్ ఎల్వీ ఇంగ్లిషు మీడియం పాఠశాల కరస్పాండెంట్ కొల్లా సత్యసరస్వతి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేస్తూ ఏనుగువీధి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. విద్యార్థులు పలు వేషాధారణలతో రైతులు పడే కష్టాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. అనంతరం అంబేడ్కర్ పార్క్‌లో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. పంటల సాగులో అన్నదాతల పడే కష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యసరస్వతి మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి దేశానికి వెన్నుముకగా నిలుస్తున్న రైతులను ప్రతిఒక్కరూ గౌరవించాలని సూచించారు. అనంతరం సుమారు 100 మంది రైతులను విద్యార్థులు సత్కరించారు. విద్యాసంస్థ అధినేత తిబిరిశెట్టి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కొల్లా సూరిబాబు, ప్రిన్సిపాల్ ఉపేంద్ర, ఏఓ జోకా అమృత, సంకల్ప టీమ్ సభ్యులు రోజీ, బీకేసి కోశాధికారి కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన కల్పించాలి

ప్రత్తిపాడు: వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రకాష్‌బాబు సూచించారు. జాతీయ రైతు దినోత్సవం సందర్భంగా స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వ్యవసాయ చట్టాలు, రైతుల హక్కులపై అవగాహన కల్పించారు. ప్యానెల్ అడ్వకేట్లు మధుబాబు, అవసరాల దేవి, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమానికి వైద్య పరికరాల అందజేత



తునిలో సాయిసేవ వృద్ధాశ్రమానికి బీపీ, సుగర్ మెషీన్లు అందజేస్తున్న అలియెన్స్ క్లబ్ ప్రతినిధులు

తుని: స్థానిక సాయిసేవ వృద్ధాశ్రమంలో వృద్ధుల సౌకర్యార్థం బీపీ, సుగర్ మెషీన్లు అందజేసినట్టు అలయెన్స్ క్లబ్ తుని శాఖ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పెంటకోట రోడ్డులోని వృద్ధాశ్రమానికి సోమవారం అలియెన్స్ క్లబ్ కార్యదర్శి అంజనేయ ప్రసాద్ సౌజన్యంలో వీటిని అందించారు. అలాగే వృద్ధులకు టవల్స్, లుంగీలు, పండ్లు, అల్పాహారం అందజేశారు. పేదలకు అలయెన్స్ క్లబ్ అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని ప్రసాద్ అన్నారు. క్లబ్ ప్రతినిధులు నెల్లిపూడి రాజబాబు, కె.భీమరాజు, నామన రవి, నాగభూషణం, రాము, సూర్య ప్రకాష్, బాషా పాల్గొన్నారు.

దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రత్తిపాడు రూరల్: మహిళలపై జరుగుతున్న దాడుల నియంత్రణకు కఠిన చట్టాలు తీసుకురావాలని ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థ మండల మాస్టర్ ట్రైనర్ ఎం.రామరాజు అన్నారు. మండలంలోని పెద్దిపాలెంలో ప్రకృతి వ్యవసాయ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ప్రచార ర్యాలీ నిర్వహించారు. మహిళలపై జరుగుతున్న దాడుల నివారణపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ ప్రస్తుతం దేశవ్యాప్తంగా మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఈ దాడులను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం లంపకలోవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని గ్రామోత్సవం



సత్యదేవుని గ్రామోత్సవంలో పాల్గొన్న ఈఓ సుబ్బారావు దంపతులు

అన్నవరం: సత్యదేవుని ధనుర్మాసోత్సవాలు అన్నవరంలో ఘనంగా జరుగుతున్నాయి. ధనుర్మాసం నెల రోజులు సత్యదేవుడు, అమ్మవారిని పల్లకీలో గ్రామంలో ఉదయం ఏడు గంటల నుంచి పది గంటల వరకు ఊరేగించి తిరిగి స్వామివారి ఆలయానికి చేర్చడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా సోమవారం ఉదయం ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను ఆలయం నుంచి ఊరేగింపుగా కొండదిగువకు తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో స్వామి, అమ్మవారిని పల్లకీలో ఊరేగించి తిరిగి ఆలయానికి చేర్చారు. గ్రామోత్సవంలో దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు దంపతులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లగుడు శ్రీనివాసు

కోటనందూరు: బాలల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీపీ లగుడు శ్రీనివాసు పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం కిశోరి వికాశంపై పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వో, ఏఎన్ఎం, వీఓఏ, అంగన్వాడీ వర్కర్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ పిల్లల సంరక్షణపై సిబ్బంది అవగాహన పెంచుకొని తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. మానవ జీవితంలో బాల్యదశ ఎంతో కీలకమన్నారు. ఈ దశలో సక్రమంగా నడిచేలా పిల్లలను, వారి తల్లిదండ్రులను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలు, పోక్సో చట్టం, వ్యక్తిగత పరిశుభ్రత, రుతుక్రమ పరిశుభ్రత, రక్తహీనత, పౌష్టికాహారం, చదువు, చట్టాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.జయరాం, సీడీపీఓ శ్రీలత, చైల్డ్ మ్యారేజ్ కోఆర్డినేటర్ శ్రీనివాసు, ఐసీపీఎస్ ప్రొటెక్షన్ అధికారి సుధాకర్, ఐసీడీఎస్ సీడీపీఓ నిహారిక, సూపర్‌వైజర్ వాణి తదితరులు పాల్గొన్నారు.

వీఓఏలను విధుల్లోకి తీసుకోవాలి



కోటనందూరులో ఎంపీడీఓ వెంకటనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు

కోటనందూరు: అనేక సంవత్సరాలుగా పని చేస్తున్న తమను రాజకీయ కోణంలో తొలగించారని, హైకోర్టు ఇచ్చిన అనుమతి ఆధారంగా తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వీఓఏలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, ఎంపీడీఓ వెంకటనారాయణ, ఏపీఎం సూర్యకుమారిలకు హైకోర్టు అనుమతి కాపీ, వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా కోటనందూరు మండలంలో 27 మంది వీఓఏలను అనధికారికంగా విధుల నుంచి తప్పించారన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తొలగించడంతోనే హైకోర్టును ఆశ్రయించామన్నారు. తమను తొలగించడానికి కారణాలను లిఖితపూర్వకంగా ఇవ్వాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ విషయం తమ పరిధిలో లేనిదని అధికారులు చేతులెత్తేసినట్లు వీఓఏలు ఆరోపించారు.

అఖిలపక్ష సమావేశానికి అనుమతి ఇవ్వాలి

గోకవరం: ఈ నెల 28న నిర్వహించ తలపెట్టిన అఖిలపక్ష సమావేశానికి అనుమతి ఇవ్వాలని అస్సాగో బాధితులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అఖిలపక్ష సమావేశానికి అనుమతి ఇవ్వడంపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు చెప్పారు. త్వరలోనే తమ గ్రామాన్ని సందర్శించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. తమ గ్రామంలోని పోలీస్ ఆంక్షలను సడలించి, మానవ హక్కులను కాపాడాలని కోరారు.

సీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తాం



ప్రత్తిపాడు సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ హామీ ఇచ్చారు. స్థానిక సీహెచ్‌సీలో సోమవారం సాయంత్రం సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ బాధ్యతల స్వీకారోత్సవం జరిగింది. కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో పాటు సభ్యులు బాధ్యతలు స్వీకరిస్తున్నట్టు రిజిస్టర్‌లో తొలి సంతకం చేశారు. సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులుగా వెలుగుల కొండలరావు, బొల్లు వెంకటేశ్వరరావు, సీహెచ్ లోవకుమారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యప్రభ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, సభ్యులను సీహెచ్‌సీ సిబ్బంది, స్థానిక నాయకులు గజమాల, శాలువాలతో సత్కరించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ బి.సౌమ్య మైఖేల్, సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టు చైర్మన్ ఇళ్ల అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ బొల్లు కొండబాబు, కొమ్ముల కన్నబాబు, అమరాది వెంకట్రావు, దాసం శేషారావు, మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా ఆర్‌జీఎల్ వరి దిగుబడి



ఆరెంపూడి వ్యవసాయ క్షేత్రంలో పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్త సీతారామశర్మ

శంఖవరం: ఖరీఫ్‌లో సాగు చేసిన ఆర్‌జీఎల్ కొత్త రకం వరి వంగడాల దిగుబడి ఆశాజనకంగా ఉందని జిల్లా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సీతారామశర్మ తెలిపారు. మండలంలోని ఆరెంపూడి వ్యవసాయ క్షేత్రంలో సాగుచేసిన ఆర్‌జీఎల్ 7039 రకం వరి పంటను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రకం బీపీటీ 5204తో పోలిస్తే 15 రోజులు ఆలస్యంగా కోతకు వచ్చిందన్నారు. మొక్క పొడవు 15 సెంటీమీటర్లు ఎక్కువగా ఉందని, సుడి దోమ, ఎండు తెగులు, మాగుడు తెగులు, మాని పండు తెగుళ్ల ఈ రకానికి ఆశించలేదని తెలిపారు. పంట కోత ప్రయోగంలో ప్లాట్‌కు 21 కిలోల దిగుబడి వచ్చిందన్నారు. రైతు బీవీ అప్పారావు, మండల వ్యవసాయ అధికారి పి.గాంధీ, వ్యవసాయ సహాయకులు మణికంఠ, రజాక్ పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



దొపర్తిలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ నేత ముదునూరి మురళీకృష్ణంరాజు తెలిపారు. మండలంలోని గిరిజన గ్రామం దొపర్తిలో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామంలో ఇటీవల మరణించిన గొట్టిపల్లి నూకరాజు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు ఎంఎంఆర్ ట్రస్టును ఏర్పాటు చేసి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బవురువాక సర్పంచ్ దిడ్డి సత్యనారాయణ, కోలా తాతబాబు, బొల్లు నాగేశ్వరరావు, మాగపు శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

ప్రత్తిపాడు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులు, చేసిన ఖర్చుపై మంగళవారం సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ కుమారస్వామి తెలిపారు. ఈ మేరకు ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు కో ఆర్డినేషన్ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఎంపీడీఓ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశానికి సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి హామీ సిబ్బంది హాజరు కావాలని ఏపీఓ కుమారస్వామి కోరారు.

కన్నుల పండువగా క్రిస్మస్ వేడుకలు



విద్యుత్ కాంతుల వెలుగులో హంసవరం ఆర్‌సీఎం చర్చి



తుని కొండవారిపేట అంగన్‌వాడీ కేంద్రంలో కొవ్వొత్తులతో క్రిస్మస్ సంబరాలు



సీతంపేట క్రిస్మస్ వేడుకల్లో చిన్నారుల నృత్య ప్రదర్శన

- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ఆకట్టుకున్న విద్యుత్ దీపాలంకరణలు

తుని: మండలంలోని హంసవరం ఆర్‌సీఎం చర్చిలో క్రిస్మస్ వేడుకలు సోమవారం కన్నులపండువగా జరిగాయి. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చర్చి, ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. బాలఏసు కోసం ఏర్పాటు చేసిన కుటీరం అందరినీ అలరించింది. క్రిస్మస్ ట్రీ, శాంతాకాజ్ వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాస్టర్లు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

తుని పట్టణంలో...

తుని: స్థానిక కొండవారిపేట సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, పిల్లలు, పిల్లల తల్లిదండ్రులు కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలతో అలరించారు. తుని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ ఆర్.సరస్వతి, అంగన్‌వాడీలు వై.ధనలక్ష్మి ఎం.లలిత కుమారి, సాయమ్మ, ఎం.చిట్టిపాప, విజయలక్ష్మి, రాజేశ్వరి, మహాలక్ష్మి, రాణి, భారతీదేవి, పద్మ పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. గ్రామంలోని పీహెచ్‌సీలో సీహెచ్‌ఓ పీఎం కుమారి ఆధ్వర్యంలో వైద్యులు శ్రీలక్ష్మి, పాపారావు క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏసుక్రీస్తు పాపులకు రక్షకుడిగా నిలిచాడన్నారు. క్రీస్తు శాంతి సందేశాన్ని ప్రతిఒక్కరూ ఆచరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు రాజేంద్రప్రసాద్, నానిబాబు, జగదీష్, డిరాజు, సిబ్బంది ఆనంద్, అనంతలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఇర్రిపాకలో..

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో సోమవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ ఆధ్వర్యంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.

శంఖవరం: మండలంలోని సీతంపేటలో రూరల్ ఇండియా సెల్ఫ్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏసుక్రీస్తు జన్మదినం విశిష్టతను పాస్టర్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

రామరాజువర్మకు రాజ్యసభ సభ్యుడు బోస్ పరామర్శ



ప్రత్తిపాడులో రామరాజువర్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు గ్రామానికి చెందిన యర్రవరం పంచాయతీ కార్యదర్శి ఎంవీ రామరాజువర్మ కుటుంబ సభ్యులను రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్ చంద్రబోస్ సోమవారం పరామర్శించారు. రామరాజువర్మ తల్లి వెంకట సీతారామలక్ష్మి (78) శనివారం మృతి చెందారు. ఆమె కళ్లను బాదం బాలకృష్ణ ఐ బ్యాంకుకు, దేహాన్ని రంగరాయ మెడికల్ కళాశాలకు దానంగా ఇచ్చిన సంగతి తెలిసిందే. కాగా బోస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి సీతారామలక్ష్మి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు, మాజీ ఎంపీటీసీ కోలా తాతబాబు తదితరులు ఉన్నారు.